సాధన మంత్రం.. విజయానికి మార్గం

- సమీపిస్తున్న పదో తరగతి పరీక్షలు
- ప్రణాళికతో చదివితే మంచి మార్కులు
- ప్రత్యేక తరగతుల నిర్వహణ
- ఉత్తమ ఫలితాల సాధనకు శ్రమిస్తున్న ఉపాధ్యాయులు


ఎర్రగుంట్ల జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల

ఎర్రగుంట్ల : నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. గత ఏడాది కంటే ఉత్తీర్ణత శాతం సాధించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. చదువే మంత్రగా సాధన చేసి మంచి మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నారు. ఇందుకోసం విద్యార్థులను నిరంతరం అప్రమత్తం చేస్తున్నారు. సమయాన్ని వృథా చేయకుండా శ్రద్ధగా చదువుకోవాలని సూచిస్తున్నారు. ప్రణాళిక బద్ధంగా విద్యాబోధన చేస్తూ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు.

ప్రత్యేక దృష్టి

కీలకమైన అంశాలను పదేపదే వివరిస్తూ విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నారు. తరగతితో వెనుకబడిన వారిని గుర్తించి , వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. సబ్జెక్టుల వారీగా పాఠ్యాంశాల్లోని ముఖ్యమైన ప్రశ్నలపై అవగాహన కలిస్తూ ముందుకు సాగుతున్నారు. పదో తరగతి పరీక్షల్లో సాధించే మార్కులతోనే భవిష్యత్ ముడిపడి ఉంటుంది.

ఎర్రగుంట్ల మండలంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థుల వివరాలు	
జెడ్పీహెచ్ఎస్ (పోట్లదుర్తి)	143
జెడ్పీహెచ్ఎస్ చిలంకూరు	47
జెడ్పీహెచ్ఎస్ యర్రగుంట్ల బాలుర	169
జెడ్పీహెచ్ఎస్ యర్రగుంట్ల బాలికల	33
జెడ్పీహెచ్ఎస్ రాణీవనం	19
మొత్తం	411

మార్చి 17 నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. సమయం దగ్గర పడుతుండటంతో ఇటూ విద్యార్థులు, అటు తల్లిదండ్రుల్లో టెన్షన్ మొదలైంది. అందుకే ఈ ఏడాది నుంచి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా శ్రమిస్తున్నాం. ప్రస్తుతం ప్రణాళికలో భాగంగా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించి, సబ్జెక్టుల్లో సందేహాలను నివృత్తి చేస్తున్నాం, విద్యార్థులకు ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా చదువుకోవాలి.

–రామాంజనేయరెడ్డి, ఎంఈఓ–2, ఎర్రగుంట్ల మండలం

ఇష్టపడి చదువుతున్నాం



ఉపాధ్యాయులు సిలబస్ అంతా పూర్తి చేశారు. సమయం ప్రకారం చదువుకుంటున్నాం. కీలకమైన ప్రశ్నలను ఉపాధ్యాయులు పునశ్చరణ చేస్తున్నారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుతున్నాం, పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తాననే నమ్మకం వచ్చింది. ఉపాధ్యాయులు దగ్గరుండి పాఠ్యాంశాలు అర్థమయ్యేలా బోధిస్తున్నారు.

–నందిని, పదో తరగతి విద్యార్థిని, జెడ్పీహెచ్ఎస్ బాయ్స్, ఎర్రగుంట్ల

ప్రత్యేక తరగతులతో ఎంతో ఉపయోగం



పాఠశాలలో ఉదయం, సాయంత్రం పూట నిర్వహించే ప్రత్యేక తరగతులు ఎంతో ఉపయోగపడుతున్నాయి. పరీక్షలకు సమయం దగ్గర పడతుండటంతో అందుకు అనుగుణంగా సబ్జెక్టులపై దృష్టి పెడుతున్నాం . సబ్జెక్టులను ఉపాధ్యాయులు పునశ్చరణ చేస్తున్నారు. మంచి మార్కులు సాధించేందుకు కష్టపడి చదువుతున్నాం.

–వల్లెపు రామతులసి, పదో తరగతి విద్యార్థిని, జెడ్పీహెచ్ఎస్ బాయ్స్, ఎర్రగుంట్ల

మేజిస్ట్రేట్ లావణ్య సేవలు మరువలేనివి


మేజిస్ట్రేట్ లావణ్యను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు

కమలాపురం: స్థానిక జూనియర్ సివిల్ కోర్టు మేజిస్ట్రేట్ లావణ్య పేద ప్రజలకు అందించిన న్యాయ సేవలు మరువలేనివని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుష్పరాజు, న్యాయవాదులు రవీంద్ర ప్రసాద్, మహేశ్వర్ రెడ్డి, గురవయ్య కొనియాడారు. 18 నెలల పాటు కమలాపురం జూనియర్ సివిల్ కోర్టు మేజిస్ట్రేట్‌గా విధులు నిర్వహించి పదోన్నతిపై నరసరావు పేట సీనియర్ సివిల్ జడ్జిగా వెళ్తున్న ఆమెను ఆదివారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. వారు మాట్లాడుతూ మేజిస్ట్రేట్ లావణ్య వివిధ కేసులపై కోర్టుకు వచ్చిన పేద ప్రజలతో మమేకమై వారికి అవసరమైన న్యాయ సేవలు అందించడంలో ఎంతో కృషి చేశారని తెలిపారు. అలాగే సబ్‌జైల్‌కు వెళ్లి రిమాండ్ ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించారని గుర్తు చేశారు. న్యాయవాదులు నారాయణరెడ్డి, రామ చంద్రుడు, ఉదయ్, రెడ్డయ్య, ప్రశాంత్‌రెడ్డి, మహేష్, శివ పాల్గొన్నారు.

భగవద్గీత పుస్తకాలు పంపిణీ

లింగాల: మండలంలోని గుణకణపల్లె గ్రామంలోని రామాలయంలో ఆదివారం ప్రజలకు భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భగవద్గీత పఠనం, మంత్ర పుష్పం, అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భగవత్ సమాజ పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోటీల్లో ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ప్రతిభ


పథకాలు సాధించిన విద్యార్థులతో డైరెక్టర్

వేంపల్లె: సాంస్కృతిక పోటీల్లో ఇడుపుల పాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ప్రతిభ కనపరిచారని డైరెక్టర్ ఏఎస్ఎస్ కుమార్ గుప్తా తెలిపారు. గుంటూరు జిల్లా వడ్లమూడి గ్రామం విజ్ఞాన్ యూనివర్సిటీలో నిర్వహించిన విజ్ఞాన్ మహోత్సవ 2025 కార్యక్రమంలో భాగంగా సాహిత్య, కళా పోటీల్లో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు జీవన్, శ్రీమన్నార్, లిఖితాంజలి, విజయభాస్కర్, అఖిల్, సిద్దార్థ, కులశేఖర్, కార్తీక్, యజ్ఞ రాణించారని పేర్కొన్నారు. అలాగే క్విజ్ పోటీల్లో రెండవ స్థానంలో, శాస్త్రీయ సంగీత పోటీల్లో మూడో స్థానం, తైక్వాండో పోటీల్లో రెండవ స్థానంలో నిలిచారని తెలిపారు.

ప్రేమోన్మాదికి ఉరిశిక్ష వేయాలి

జమ్మలమడుగు: అన్నమయ్య జిల్లాలో యువతిపై యాసిడ్ పోసి కత్తితో దాడి చేసిన గణేష్‌కు ఉరి శిక్ష విధించాలని డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఈ తరహా ఘటనలు ఎక్కువవుతున్న నేపథ్యంలో విచారణ త్వరిగతిన పూర్తిచేసి, నిందితుడికి శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలపై అత్యాచారాలను, హత్యాచారాలను అరికట్టడానికి కఠిన చట్టాలు తేవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నరేంద్ర, ఇసాక్ పాల్గొన్నారు.

శిల్పారామంలో అలరించిన నృత్యం


జానపద నృత్యం చేస్తున్న చిన్నారులు

పులివెందుల టౌన్ : స్థానిక శిల్పారామంలో ఆదివారం ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. పిల్లలు, పెద్దలు ఆటపాటలతో ప్రాంగణమంతా సందడిగా మారింది. కోలా ప్రసాద్ సహకారంతో కదిరి మనూస్ డ్యాన్స్ అకాడమీ మాస్టర్ మనోహర్ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. దేవాది దేవ గణపతి దేవ అంటూ సాగే ఈ పాటతో మొదలై కొండలలో నెలకొన్న కోనేటి రాయుడు వాడు, గోదారి గట్టు మీద రామ సిలకవే పాటలకు చిన్నారులు చేసిన నృత్యానికి కరతాళ ధ్వనులతో ప్రోత్సహించి అభినందించారు. కార్యక్రమం ఏర్పాట్లను శిల్పారామం ఏఓ సుధాకర్ పర్యవేక్షించారు.

70 మద్యం బాటిళ్లు స్వాధీనం

జమ్మలమడుగు రూరల్: నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం నాగిశెట్టిపల్లికు చెందిన కొల్లు వెంకటేష్ అనే వ్యక్తి గ్రామంలో విక్రయించడానికి తీసుకెళ్తున్న 70 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని సీఐ ఎస్. లింగప్ప తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పల్లెల్లో అసాంఘిక కార్యకలపాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

హామీలను విస్మరించిన 'కూటమి'


ఐకమత్యం చాటుతున్న బీసీ నాయకులు

జమ్మలమడుగు: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించిందని బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు లింగమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని నారాపురస్వామి ఆలయం సమీపంలో బీసీ కార్యాలయాన్ని నియోజకవర్గ అధ్యక్షుడు జోల్లు కొండయ్య అధ్యక్షతన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు బీసీ యాక్టు తెస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారని తెలిపారు. బీసీలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీలందరూ ఐకమత్యంగా పోరాటం చేసినప్పుడే రాజ్యాధికారం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు బొర్ర రామాంజనేయులు, రామదాసు, ప్రధాన కార్యదర్శి జీవన్‌కుమార్, ఎం.కోబరావు, వాల్మీకి సంఘం అధ్యక్షుడు కంబయ్య పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

కడప కల్చరల్: ప్రజల ఆరోగ్యమే జిల్లాకు మహాభాగ్యమని కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి, టీడీపీ నేత శ్రీనివాసులురెడ్డి అన్నారు. కడప నగరంలో రిఫ్రిజిరేషన్ అండ్ ఏసీ టెక్నీషియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహవీర్ సర్కిల్ నుంచి ఆదివారం 10కే మారథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాల పరిశుభ్రతపై నగర వాసులను అవగాహన కల్పించే చర్యలు చేపట్టాలన్నారు.

శ్రీకృష్ణ దేవరాయుల కీర్తి.. నేటి తరానికి స్ఫూర్తి


పులివెందుల టౌన్ : శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గూడూరు గురుప్రసాద్


జమ్మలమడుగు: శ్రీకృష్ణదేవరాయులుకు నివాళులర్పిస్తున్న బలిజ సంఘం నాయకులు

పులివెందుల టౌన్ : శ్రీకృష్ణ దేవరాయుల కీర్తి.. నేటి తరానికి స్ఫూర్తి అని శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకృష్ణదేవరాయల 554 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పూలంగళ్ల సర్కిల్ సమీపంలో ఉన్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయులు విజయ నగర సామ్రాజ్య చక్రవర్తిగా ఉంటూ ఎన్నో ఆలయాలను నిర్మించి చరిత్రలో ఎక్కారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాచనేని ఆంజనేయులు, మాజీ అధ్యక్షుడు గంగల వీరాంజనేయులు, యూత్‌ప్రెసిడెంట్ జగన్, దరిమిశెట్టి బాబు, పూల రమేష్‌బాబు, సాగర్‌బాబు, వెంకటనారాయణ, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ దేవరాయులు జయంతి

సింహాద్రిపురం: మండలం కేంద్రం సింహాద్రిపురంలో బలిజ సంఘం అధ్యక్షుడు తుపాకుల రాఘవేంద్ర ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకృష్ణదేవరాయల 554 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బొడ్డయ్యపాలెం ప్రాంగణంలో శ్రీకృష్ణ దేవరాయలు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశభాషలందు తెలుగు లెస్స అని చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నాగశంకర్, రామకృష్ణ, డాక్టర్ సాయి, సూర్యనారాయణ, వెంకటనారాయణ, సాంబశివుడు, రమణ పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు: రాయలసీమ ప్రాంతాన్ని రత్నాల సీమగా చేసిన ఘనత శ్రీకృష్ణదేవరాయులకే దక్కుతుందని కడప కాట్సా చైర్మన్ యనమల సుబ్రహ్మణ్యం, బలిజ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం శ్రీకృష్ణదేవరాయ 554వ జయంతి సందర్భంగా ముద్దనూరు రోడ్డులోని నీళ్ల ట్యాంక్ వద్ద శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బలిజ సంఘం అధ్యక్షుడు మల్లికార్జున, గౌరీదేవి, నగలపాటి ఉషాదేవిపాల్గొన్నారు.

శ్రీ రంగనాథ స్వామి చరిత్ర పుస్తకావిష్కరణ


శ్రీరంగనాథుస్వామి చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : పులివెందులలో కొలువైన శ్రీ రంగనాథ స్వామి చరిత్ర పుస్తకాన్ని ఆలయ చైర్మన్ చింతకుంట సుధీకర్ రెడ్డి, ఈఓ కొట్టే వెంకట రమణ ఆదివారం ఆవిష్కరించారు. 1929లో లగిశెట్టి వెంకటరమణయ్య రచించిన పులివెందుల చరిత్ర పుస్తకం ఆధారంగా సీనియర్ జర్నలిస్ట్, రచయిత అల్లం రంగనాయకులు రాయల్ సేకరించిన చారిత్రక అంశాలను, మరిన్ని నూతన విషయాలను జతపరిచి పుస్తకాన్ని రచించారు. ఈ సందర్భంగా స్థానిక పూలంగళ్ల సర్కిల్ వద్ద ఉన్న శ్రీ రంగనాథ స్వామి కల్యాణ మండపంలో ఆదివారం ఈ చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి మాట్లాడుతూ పులివెందులకు మూలాధారమైన శ్రీ రంగనాథ స్వామి వారి కథను, పులివెందుల చరిత్రను తెలియజేసే పుస్తకాన్ని రూపొందించిన రచయిత అల్లం రంగనాయకులు రాయల్‌ను అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా కీర్తిశేషులు లగిశెట్టి వెంకటరమణయ్య మనుమడు లగిశెట్టి వివేకానందమూర్తి దంపతులు శ్రీ రంగనాథ స్వామి వారికి ఉత్సవ విగ్రహాలకు వెండి నామాలను బహూకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు సోమేపల్లి కృష్ణరాజేష్ శర్మ, చల్లా నారాయణస్వామి, చల్లా చంద్రశేఖర్ నాయుడు, మాజీ ఆలయ చైర్మన్ పద్ధతి నారాయణ, ఆలయ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

రేపు బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

చింతకొమ్మదిన్నె : మండలంలో బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలకు దరఖాస్తులు చేసుకున్న వారికి (బీసీ, కాపు, ఓసి–ఈడబ్ల్యూఎస్) మంగళవారం ఉదయం 10:30 గంటల నుంచి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కుళ్లాయిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని ఆయా బ్యాంకు మేనేజర్ల ఆధ్వర్యంలో రుణ మంజూరు ప్రక్రియ జరుగుతుందని, అభ్యర్థులు హాజరు కావాలని కోరారు.

వల్లూరు: మండలానికి కేటాయించిన బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం ఉదయం 10–30 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రఘురాం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత బ్యాంకుల ప్రతినిధుల సమక్షంలో ఈ ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆదాయ, కుల సర్టిఫికెట్లకు సంబంధించి ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఆయన తెలిపారు.

లింగాల: మండలంలో బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలకు దరఖాస్తులు చేసుకున్న వారికి (బీసీ, కాపు, ఓసి–ఈడబ్ల్యూఎస్) 19వ తేదీన ఉదయం 10:30 గంటల నుంచి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ఆయా బ్యాంకు మేనేజర్ల ఆధ్వర్యంలో రుణ మంజూరు ప్రక్రియ జరుగుతుందని, అభ్యర్థులు తప్పక హాజరు కావాలని కోరారు.

పీసీ నంబర్లు లేకుండా నడిపితే చర్యలు

ప్రొద్దుటూరు క్రైం: పీసీ నంబర్లు లేకుండా ఆటో నడిపితే చర్యలు తీసుకుంటామని ప్రొద్దుటూరు డీఎస్పీ భావన పేర్కొన్నారు. స్థానిక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆవరణంలో ఆటో డ్రైవర్లతో ఆదివారం జరిగిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలో తీసుకెళ్లరాదని, ఇయర్ ఫోన్స్ పెట్టుకొని డ్రైవింగ్ చేయరాదని అన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే కేసులు నమోదు చేస్తామని, పతి ఒక్కరూ యూనిఫాం తప్పక ధరించాలని పేర్కొన్నారు. ట్రాఫిక్ సీఐ దేవకిరణ్ మాట్లాడుతూ మైనర్లు ఆటోలు నడిపితే యజమానులపై కేసు నమోదు చేస్తామన్నారు. అనుమానాస్పద వ్యక్తులు ఆటో ఎక్కితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మహిళలపట్ల మర్యాదగా నడుచుకోవాలని సూచించారు.

రేపటి నుంచి ఆధార్ మొబైల్ కేంద్రాలు

కమలాపురం : మండలంలోని చిన్నచెప్పలి, జంభాపురం సచివాలయాల్లో ఈ నెల 18, 19వ తేదీల్లో రెండు రోజుల పాటు ఆధార్ మొబైల్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ జ్యోతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 20, 21వ తేదీల్లో దేవరాజుపల్లె, ఎర్రగుడిపాడు సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశామని ఆమె తెలిపారు. ఈ మొబైల్ ఆధార్ కేంద్రాల్లో 0–5 సం. పిల్లలకు ఆధార్ అప్‌డేట్ చేయడంతో పాటు ఆధార్ కార్డులో చిరునామా, ఫొటో మార్పు, ఆధార్‌కు ఫోన్ నెంబర్ లింక్, వేలి ముద్రలు అప్‌డేట్ చేయుట తదితర సేవలు అందిస్తామని తెలిపారు. విద్యార్థులతో పాటు అన్ని వయస్సుల వారు ఈ ఆధార్ మొబైల్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా కోట గంగమ్మ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో కోట గంగమ్మ

కమలాపురం: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వెలసిన శ్రీ కోట గంగమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలను ఆలయ నిర్వాహకులు, కమిటీ సభ్యులు, పట్టణ ప్రజల సమక్షంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గంగమ్మకు క్షీరాభిషేకం, పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించారు. పట్టణం నుంచే కాక సమీప గ్రామాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు ఆలయానికి చేరుకొని సామూహిక కుంకుమార్చన చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. అలాగే మహిళా భక్తులకు గాజులు, పసుపు, కుంకుమ నిర్వాహకులు పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

గణిత ప్రతిభా పరీక్షకు అనూహ్య స్పందన


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సీఐ నరసింహులు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని సత్రం బడిలో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల 7,8,9,10వ తరగతుల విద్యార్థులకు ఆదివారం జరిగిన గణిత ప్రతిభా పరీక్షకు విశేష స్పందన లభించింది. మొత్తం 312 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరైనట్లు నిర్వాహక ప్రతినిధి ఎస్. దాదాపీర్ తెలిపారు. ఈ పరీక్షను పులివెందులకు చెందిన ప్రవాస భారతీయులు చాపాటి మధుసూదన రెడ్డి ప్రతి ఏటా తన తండ్రి ప్రధానోపాధ్యాయుడు చాపాటి గంగిరెడ్డి జ్ఞాపకార్థం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి పట్టణ సీఐ నరసింహులు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అనంతరం బహుమతులను ప్రదానం చేశారు. చాపాటి గంగిరెడ్డి సతీమణి, పులివెందుల, లింగాల, వేముల మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలతో యూసీఐల్ చెలగాటం

- గ్రామాల్లో తూతూ మంత్రంగా వైద్య చికిత్సలు
- వైఎస్సార్‌సీపీ నేత రామలింగారెడ్డి


వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రామలింగారెడ్డి

వేముల: యురేనియం బాధిత గ్రామాల్లో ప్రజల ఆరోగ్యాలతో యూసీఐఎల్ చెలగాటం ఆడుతుందని వైఎస్సార్‌సీపీ మండల పరిశీలకుడు రామలింగారెడ్డి మండిపడ్డారు. మండలంలోని వేల్పుల గ్రామంలో ఆదివారం యూసీఐఎల్ నిర్వహించిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యురేనియం బాధిత గ్రామాల్లో యూసీఐఎల్ ప్రతి నెల వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి చికిత్సలు అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నారే తప్పా.. సరైన చికిత్స అందించడం లేదని ఆరోపించారు. వేల్పుల గ్రామంలో అన్ని రకాలు వ్యాధులకు ఒకే రకం మందులు ఇవ్వడంపై యూసీఐఎల్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యం పట్ల యూసీఐఎల్‌కు చిత్తశుద్ధిలేదని, తూతూ మంత్రంగా చికిత్సలు అందిస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఇకపై వైద్యులు లేకుండా వైద్య శిబిరాలు నిర్వహించవద్దన్నారు. ఇప్పటికైనా ప్రత్యేక వైద్యులచే వైద్య చికిత్సలు అందించాలని డిమాండ్ చేశారు.

ముగిసిన శ్రీసీతారామ విగ్రహప్రతిష్ట


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

తొండూరు : తొండూరు మండలం అగడూరు గ్రామంలో శ్రీసీతారామ లక్ష్మణ, హనుమత్, నాగశిలల ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి హాజరయ్యారు. అగడూరు గ్రామానికి ఆయన చేరుకోగానే వైఎస్సార్ సీపీ నాయకులు శివశంకర్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయానికి చేరుకున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన సీతారాములను దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ముందుగా ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ అనంతరం ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించారు.

బండలాగుడు పోటీలను ప్రారంభించిన ఎంపీ

శ్రీసీతారాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా అగడూరు గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల మైదానంలో నిర్వహించిన బండలాగుడు పోటీలను కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రారంభించారు. బండలాగుడు పోటీల్లో మొదటి విజేతగా నంద్యాల జిల్లా బొడిదికి చెందిన కుందురు రాం భూపాల్‌రెడ్డి ఎద్దులు 2,506 అడుగులు లాగి రూ.లక్ష అందుకున్నారు. రెండవ బహుమతిగా మైదుకూరు గ్రామానికి చెందిన కుర్రా వెంకటేష్ యాదవ్ ఎద్దులు 2,370 అడుగులు లాగి రూ.80వేలు, మూడవ బహుమతిని ప్రొద్దుటూరు మండలం చౌటిపల్లికి చెందిన మార్తల చంద్రఓబుల రెడ్డి ఎద్దులు 2,137 అడుగులు లాగి రూ.60వేలు నగదు బహుమతిని అందుకున్నారు.

పోలీసుల దృష్టికి సమస్యలు తీసుకురండి


ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ ఎస్కే రోషన్

కమలాపురం: విద్యార్థులకు, అధ్యాపకులకు, పాఠశాల, కళాశాల సిబ్బందికి ఎలాంటి సమస్యలున్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలని కమలాపురం సీఐ ఎస్కే రోషన్ తెలిపారు. ఆదివారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయన కమలాపురంలోని డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలను సందర్శించారు. అలాగే వసతి గది, వంటశాల, హాస్టల్ గదులను పరిశీలించారు. అనంతరం ఆయన ఈవ్ టీజింగ్, ఆకతాయిలతో ఇబ్బందులున్నాయా? అని సిబ్బందితో ఆరా తీశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ లా అండ్ ఆర్డర్ సమస్యలే కాకుండా ఎలాంటి సమస్యలు ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకువస్తే తక్షణం పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ తులశమ్మ, ఉపాధ్యాయులు, హెడ్ కానిస్టేబుల్ భవాని, విద్యార్థులు పాల్గొన్నారు.

అధ్వానదారులు.. ప్రజలకు అవస్థలు


కంకర తేలిన రోడ్డు

పులివెందుల రూరల్ : గ్రామీణ ప్రాంత రహదారులను అభివృద్ధి చేసి రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచాలనే ప్రభుత్వ లక్ష్యం క్షేత్రస్థాయిలో నెరవేరడం లేదు. మండలంలోని వివిధ గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా ఉండడంతో ప్రయాణం నరకంగా మారింది. మండల పరిధిలోని కనంపల్లె నుంచి మోట్నూతలపల్లెకు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. గ్రామీణ రహదారిపై భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో గుంతలమయంగా మారాయి. గుంతలమయమైన రోడ్డులో ద్విచక్ర వాహనదారులు గ్రామానికి వెళ్లాలంటేనే ఇబ్బందులు పడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా గ్రామీణ రోడ్లపై భారీ వాహనాలు నడపడంతో గుంతలు ఏర్పడ్డాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తెచ్చినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామీణ రహదారిలో భారీ వాహనాలు వెళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


దెబ్బతిన్న కనంపల్లె - మోట్నూతలపల్లె రోడ్డు